
# పెట్టుబడి-గిట్టుబడి

కె. మధుసూదనరావు

పొద్దున్నే దినపత్రిక చూస్తున్న మీనాక్షి ఉన్నట్టుండి గావుకేక పెట్టింది ''ఏవండీ'' అని.

పాలప్యాకెట్ తేవటానికి ప్యాంట్ వేసుకోబోతున్న లంబోదరరావు భయంతో ప్యాంట్ పడేసి బాణంలా పరిగెత్తుకొచ్చాడు. ఆ స్థితిలో భర్తను చూసి మరోసారి కెవ్వుమంది మీనాక్షి. వచ్చిన వేగంతో లోపలికెళ్ళి ప్యాంట్ వేసుకొచ్చాడు లంబోదర రావు. అతనికి చిరాకు ఎక్కువ అయితే ఎదుట వున్న వారిని తిడతాడు- పైకి కాదు లోలోపలే.



మొదటి కేకకి నిద్రలేచి, కళ్ళు తెరచి, రెండో అరుపుకి లేచి కూచుని ఆరున్నొక్క రాగాన్ని బాగా శృతి పెంచి ఆలాపించసాగేడు- రెండేళ్ళ టింకూ అనబడే అగ్నివేష్. ముద్దుల కుమారుని ఏడుపు కచ్చేరీని ఆపడానికి భార్యాభర్తలు పోటీపడ్డారు. లంచాలుగా ఇవ్వబడ్డ చాక్లెట్లు, బిస్కెట్లు, ఆట వస్తువులు మూలకొక్కటి పడి ఓటమిపాలయ్యాయి.

అతి గారాబంతో అడిగింది వెంటనే అమర్చే అలవాటు చేయడంతో టింకూలో పెంకితనం పెరిగింది. మొండితనం వాడి చురుకుతనాన్ని వెనక్కి నెట్టేసింది.

కోల్పోతున్న సహనాన్ని కూడదీసుకుని ''ఏం కావాలి నాన్నా? చెప్పు. మా బుజ్జివి కదూ'' అంటూ టింకూ గడ్డం పట్టుకుని అడిగింది మీనాక్షి.

''నాకు బంతి కావాలి'' ఈ మూడు మాటలు అని మళ్ళీ కొనసాగించాడు టింకూ శోకాలు.

ఇంట్లో వున్న బంతిని వెదికి తీసుకొచ్చాడు లంబోదరం.

''ఇది కాదు. నాకు కొత్తది, పెద్దది కావాలి'' ఎంత పెద్దదో వాడి 'పెద్ద' అన్న మాటలో, చాచిన రెండు చేతుల్లో కన్పించింది.

అంతే. అంత పొద్దున్నే బయటకు వెళ్ళి, ఏదో షాపులో టింకూ చెప్పిన సైజున్న బంతిని తీసుకొని వచ్చాడు లంబోదరం. టింకూ ఆటలో పడ్డాడు. అప్పుడు గుర్తొచ్చిందతనికి భార్య పెట్టిన కేక.

''మీనాక్షీ! ఇంతకీ నువ్వు ఎందుకరిచావు. నీ కేకే కదా ఇప్పుడింత సీనుకి కారణమైంది'' పాల ప్యాకెట్ భార్య చేతికందించాడు.

''అయ్యో! టింకూ ఏడుపుతో ఆ విషయమే మరిచాను. పేపర్లో ఈ ప్రకటన చూడండి'' ఉత్సాహంగా దినపత్రిక పేజీ చూపింది.

''ఆ... ఏముంటుంది, కాంధారి హోటల్లో ఏ నగల ప్రదర్శనో, ఐలాపురం హోటల్లో చీరల మేళానో అయ్యుంటుంది. అంతేగా'' తేలిగ్గా అంటూనే పేపరు తీసుకొని చదివాడు లంబోదరం గట్టిగా పైకి.

''డాలర్ కాన్వెంటు స్కూలు, ఇంగ్లీషు మీడియం, గొల్లపూడి, విజయవాడ. నర్సరీ నుండి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ఆరంభమైనవి.

మా స్కూలు ప్రత్యేకతలు.

1. నర్సరీ నుండి- గేమ్స్, స్పోర్ట్స్, మ్యూజిక్, డాన్స్, కంప్యూటర్స్, ఇంటర్‌నెట్‌లలో శిక్షణ.
2. స్పోకెన్ ఇంగ్లీషుకై ప్రత్యేక తరగతులు.
3. ఎంసెట్, ఐఐటి, గేట్, ఐసెట్, ఎడ్సెట్ మొదలైన అన్ని సెట్లకు ఫౌండేషన్ కోర్సులు.

ముఖ్యగమనిక- గతవారం ఎల్‌కేజీ క్లాసు ప్రవేశానికి నిర్వహించిన పరీక్షా ఫలితాలు''

ఇంతవరకు చదివి మీనాక్షివైపు చూస్తూ..

''మీనాక్షీ! ఎంట్రెన్స్ రిజల్ట్స్ అట. మన టింకూ నంబర్ వన్ థౌజండ్ వన్ కదా. ఎక్కడుందీ... ఆ... దొరికింది. టింకూ పాసయ్యాడోయ్. వాడికి ఎల్‌కెజిలో సీటొచ్చింది. యాహూ...'' అని బిగ్గరగా అరుస్తూ కుర్చీలోంచి లేచి గంతులేయసాగాడు లంబోదరం.

''నేను ముందే చూసి బిగ్గరగా అరిచింది ఇందుకే. అర్థమయిందా?'' అంటూ మీనాక్షి కూడా గెంతసాగింది.

టింకూ బంతి ఆట ఆపి తల్లిదండ్రుల్ని మార్చి మార్చి చూశాడు. చప్పట్లు చరిచాడు. లంబోదరం టింకూని భుజాలపైకి ఎత్తుకొని ఎగిరాడు. పదినిమిషాల తర్వాత అలసటతో కుర్చీల్లో కూలబడ్డారు మీనాక్షి, లంబోదరరావు.

''ఆ.. ఎంట్రెన్స్ ఎగ్జామ్ కోసం మనమెంత కష్టనష్టాలు పడ్డామో కదండీ. అవన్నీ నేటికి ఫలించాయి'' గుండెలపై చేయివేసి అంటున్న మీనాక్షి మాటలు లంబోదరాన్ని టైం మిషన్లా నెల రోజుల ముందుకు ఈడ్చుకెళ్ళి పడేశాయి.

* * *

డాలర్ కాన్వెంట్ స్కూలులో ఎల్‌కెజి ప్రవేశ పరీక్ష కోసం అప్లికేషన్లు అమ్మే కౌంటర్ దగ్గర జనాలు గుమికూడి వున్నారు కొత్త సినిమా టిక్కెట్ల కోసం తోసుకుంటున్న వాళ్ళలా. అప్లికేషన్ ధర రెండొందల రూపాయలు.

ఆ గుంపులోకి జొరబడ్డ లంబోదరరావు ఇరవై నిముషాల యుద్ధం తర్వాత అప్లికేషన్ సాధించాడు. అతని కన్నుల్లో కోటి రూపాయల లాటరీ వచ్చినంత గర్వం, ఆనందం. సంతోషం కాస్త ఎక్కువైందేమో ''యాహూ'' అని గట్టిగా అరిచాడు. జడుసుకొని వింతగా తననే చూస్తున్న జనాల్ని పట్టించుకోకుండా పెద్ద పెద్ద అడుగులేస్తూ ఇంటికి వెళ్ళాడు లంబోదరం.

ఇక ఎంట్రెన్స్ ఎగ్జాం కోసం కోచింగ్ ఇచ్చే సెంటర్ కోసం వెతికి వెయ్యి రూపాయల ఫీజుతో ఒక సెంటర్లో చేర్పించాడు. రోజుకి రెండు గంటలు శిక్షణ. పరీక్షల్లో సైన్స్, ఇంగ్లీషు, మేథమేటిక్స్‌లకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. టింకూకి ఇదంతా గందరగోళంగా వుంది.

టింకూని ప్రతిరోజూ పొద్దున్నే లేపి కూచోబెట్టే సరికి తల ప్రాణం అరికాల్లోకి వచ్చేది లంబోదరానికి. టింకూ చిన్న మెదడులోకి నంబర్లు, ఎక్కాలు, కూడికలు, తీసివేతలు ఎక్కించడం మొదలుపెట్టాడు లంబోదరరావు. పెళ్లైన నాలుగేళ్లకు పుట్టిన టింకూ ఆడిందే క్రికెట్, పాడిందే డ్యూయెట్‌గా సాగిందిన్నాళ్ళు. ఇప్పుడు ఎల్‌కెజి సీటుకోసం వాడిమీద అధికారం చెలాయిస్తే వాడూరుకుంటాడా?

మొదటి రోజు...

''టింకూ! రా. నంబర్స్ చెప్పు వరుసగా'' కార్టూన్ నెట్‌వర్క్‌లో లీనమైన టింకూని పిలిచాడు లంబోదరం.

''ఉహూ. నేను రాను. టివిలో కార్టూన్ సీరియల్ చూస్తున్నా'' తండ్రివైపు చూడకుండానే అన్నాడు.

''రా నాన్నా! స్కూల్లో నీకు టెస్టు పెడతారు. రాయాలి. పాసవ్వాలి. ఆ స్కూల్లో సీటొస్తే ఎంతో గ్రేట్'' బతిమాలాడు లంబోదరం.

''మరి నాకు ఫ్రూట్ సలాడ్ కొనిపెడతావా?'' అడిగాడు లంచం. చిన్నపనులు చేయడానికి ఇలాంటి లంచం అలవాటు చేసినందుకు చింతించాడు లంబోదరం మొదటిసారి.

''అలాగే... నంబర్స్ రాస్తే వెంటనే తెచ్చి ఇస్తా'' ఒప్పుకున్నాడు లంబోదరం.

''ఉహూ. నాకు ఇప్పుడే తెచ్చి ఇవ్వాలి. ఫ్రూట్ సలాడ్ తిని రాస్తాను నంబర్స్'' టింకూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా అన్నాడు.

ఇక తప్పదని ఆ ఉదయం తిరిగి తిరిగి కొడుకు డిమాండు చేసిన ఫ్రూట్ సలాడ్ తెచ్చాడు. ప్యాక్ విప్పి గిన్నెలో వేసి తెచ్చి టింకూకి ఇచ్చింది మీనాక్షి. కరిగి ద్రవమైన ఆ ఫ్రూట్ సలాడ్ బాగాలేదని మళ్ళీ ఏడుపు మొదలుపెట్టాడు టింకూ. సలాడ్ గిన్నెని ఫ్రిజ్‌లో వుంచి గంట తర్వాత ఇచ్చింది మీనాక్షి. ఫ్రూట్ సలాడ్‌ని లాగించాకే వాడు నంబర్లు రాసి చూపాడు. మీనాక్షి సంతోషంతో పొంగినా- లంబోదరం మాత్రం విసుక్కున్నాడు.

''వీడికిదేం తిండి రోగమే. వీడిని మేపడానికి నా జీతం సరిపోదనుకుంటా. వెధవని నీళ్ళలో ముంచి కొట్టాలి''.

''పోన్లెండి. బుజ్జి కన్న. తింటే తిన్నాడు. మీ సొమ్మంతా దోచి పెట్టినట్లు తిడతారేం?'' భార్యామణి మాటలకు నోటికి తాళం వేసుకున్నాడు లంబోదరం.

అలా మొదలైంది టింకూ కోచింగ్ ఇంట్లో. అంతే కాదు. ఆ స్కూల్ ఎంట్రెన్స్‌లో పరీక్ష రాసేందుకు కోచింగ్ సెంటర్లెన్నో వెలిశాయి. అందులో ఒక దాంట్లో వెయ్యి రూపాయల ఫీజు కట్టి టింకూని చేర్చాడు లంబోదరం.

''మీనాక్షీ! ఎంట్రెన్స్ రిజల్ట్స్ అట. మన టింకూ నంబర్ వన్ థౌజండ్ వన్ కదా. ఎక్కడుందీ... ఆ... దొరికింది. టింకూ పాసయ్యాడోయ్. వాడికి ఎల్‌కెజిలో సీటొచ్చింది. యాహూ...'' అని బిగ్గరగా అరుస్తూ కుర్చీలోంచి లేచి గంతులేయసాగాడు లంబోదరం.

సాయంత్రం శిక్షణనిచ్చే ఉద్యోగం మీనాక్షిది. మోడల్ పేపర్లు వున్నాయి కదా- కోచింగ్ సెంటర్ వాళ్ళు ఇచ్చినవి. వాటిని చూసి అదే మాదిరి ప్రశ్నలు తయారుచేసి టింకూకి శిక్షణ ఇచ్చింది. తన బియస్సీ చదువు ఇలా ఉపయోగపడినందుకు సంబరపడింది మీనాక్షి. ఇల్లాలి చదువు - ఇంటికి వెలుగు అనే అక్షర ప్రభ సూక్తికి తన ఇంట్లో స్థానమిచ్చినందుకు లంబోదరం ఆనందంతో రెండంగుళాలు ఉబ్బిపోయాడు.

టింకూని ప్రవేశ పరీక్షకు తయారుచేయడానికి - ఎన్నెన్ని ఐస్‌క్రీములు కరిగిపోయాయో, ఎన్నెన్ని బజ్జీలు, పిజ్జాలు అరిగిపోయాయో లంబోదరానికే తెలుసు.

ఎలాగో ఎంట్రెన్స్ పరీక్ష జరిగింది. ఇప్పుడు సీటు కూడా వచ్చింది. ఇదీ - మీనాక్షి, లంబోదరాల గెంతుల వెనకున్న ఫ్లాష్‌బాక్.

* * *

మర్నాడు టింకూని తీసుకొని 'డాలర్ కాన్వెంటు' స్కూలుకి వెళ్ళారు - మీనాక్షి, లంబోదరరావు.

ఒక్కొక్క పేరే పిలుస్తున్నాడు ప్యూన్ – పావుగంట తర్వాత "అగ్నివేష్, అగ్నివేష్" అని అరిచాడు.

ప్రిన్సిపాల్ గదిలోకెళ్ళారు. లావుపాటి మనిషి కుర్చీలో – బియ్యం బస్తా వేసినట్టు కూర్చున్నాడు. ముందు టేబులు, రెండు కుర్చీలు వేసి వున్నాయి.

"నమస్తే సర్" లంబోదరరావు చిరునవ్వుతో వినయాన్ని దట్టించాడు.

"రండి, రండి" కుర్చీలు చూపిస్తూ నవ్వాడు ప్రిన్సిపాల్. మీనాక్షి, లంబోదరరావు చెరో కుర్చీలో కూర్చున్నారు. టింకూ టేబుల్‌ను ఆనుకొని నుంచు న్నాడు.

"అగ్నివేష్ అంటే ఈ అబ్బాయేనా? మీరేనా ఇతని పేరెంట్స్" ప్రశ్నించాడు ప్రిన్సిపాల్.

"అవును సార్" వినయం తగ్గించకుండా అన్నాడు లంబోదరం.

"మీరిద్దరూ ఏం చదివారు?"

**డొనేషన్ ఇరవై వేల రూపాయల తోపాటు అడ్మిషన్ ఫీజు, పరీక్ష ఫీజు, స్కూల్ బస్ ఫీజు, లైబ్రరీ, లేబొరేటరీ, కంప్యూటర్ ఫీజులు అన్నీ వివరంగా ఆకర్షణీయమైన అంకెలతో ముద్రించి వున్న కాగితం లంబోదరానికి ముచ్చెమ టలు పట్టించింది. అంతేనా? ఎల్‌కేజీ నుండే ఎంసెట్, ఐఐటీ లకు ఫౌండేషన్ కోర్సు ఫీజు కూడా చూసేసరికి జుట్టు పీక్కో వడం మొదలెట్టాడు లంబోదరం.**

"నేను బి.ఏ. పాసై రైల్వేలో ఉద్యోగం చేస్తు న్నాను. ఈవిడ మా ఆవిడ మీనాక్షి. బిఎస్సీ చదివింది. నా పేరు లంబోదరరావు" ఒక్క ప్రశ్నకి పరిచయ మంతా చేసుకున్నాడు లంబోదరం.

"అయితే మీకో పరీక్ష. చాలా చిన్నది. ఇంగ్లీషు, తెలుగు, హిందీ భాషల్లో చూచివ్రాత – నాలుగేసి లైన్లు రాయండి" అంటూ కాగితాలిచ్చాడు ప్రిన్సి పాల్. ఒక్కొక్కరికి మూడేసి ఇచ్చిన కాగితాల్లో మూడు భాషల్లో పై వరుసలో అందమైన అక్షరాలు.

వస్తున్న విసుగుని వినయంతో కప్పి నవ్వుతూ "నీ నడుముకి తాడుకట్టి కృష్ణానదిలో ముంచి ముంచి తేల్చ' అని పైకి అన్లేక మనసులో తిట్టుకు న్నాడు లంబోదరం. ఇంగ్లీషు, తెలుగు రాశారు. కానీ ఎప్పుడో టెన్త్‌లో వదిలేసిన హిందీ అక్షరాలు రాయా లంటే తలప్రాణం పెన్నులోకి వచ్చింది. మీనాక్షికీ డిటోడిటో.

ఇద్దరూ రాసిన కాగితాలు అందుకొని చూస్తూ, "వెరీగుడ్. చాలా బాగుంది – మీ ఇద్దరి హేండ్ రైటింగ్" మెచ్చుకున్నాడు ప్రిన్సిపాల్.

"థాంక్యూ సర్. గుడ్ హేండ్ రైటింగ్ వున్న పేరెంట్స్‌కి బహుమతులున్నాయా సార్" ఆశగా అడి గాడు లంబోదరం.

"ఆ... బహుమతా? పాడా? మీ అబ్బాయి ఎప్పు డైనా బద్ధకించో లేక అనారోగ్యం వల్లో హోంవర్క్ చేయకపోతే కష్టం కదా?" అన్నాడు ప్రిన్సిపాల్.

'దానికీ, దీనికీ ఏం సంబంధంరా – నీ చెవుల్లో ఇంకు పొయ్య' అని మనసులో తిట్టుకొన్నాడు లంబో దరం.

"అయితే?" ఆశ్చర్యార్థకాన్ని గొంతులో, ముఖంలో ఒలికించింది మీనాక్షి.

"అప్పుడు – మీ ఇద్దరిలో ఎవరైనా తప్పనిస రిగా ఆ హోంవర్క్ పూర్తిచేసి పంపాలి కదా?" మెల్లగా విషయం తేల్చాడు ప్రిన్సిపాల్.

"ఆహా! ఏం తెలివి సార్ మీది? పాదరసమను కోండి. పిల్లవాడి హోంవర్క్ పెద్దల చేత చేయిస్తారూ" నవ్వుతూ అంటూ మనసులో 'ఒరేయ్ నువ్వు శాడిస్టు విరా! నీ ముక్కులో వేడివేడి టీ పొయ్య' అనుకు న్నాడు లంబోదరం.

"మాకు వీలుకాదు సార్. హోంవర్క్ చేయలేం" వెంటనే చెప్పింది మీనాక్షి.

"అలా అయితే ఫైను కట్టాలి. హోంవర్క్ చేయక పోతే ప్రతిసారీ పది రూపాయలు ఫైను" షాకిచ్చాడు ప్రిన్సిపాల్.

"ఫైనా?" నోరు బార్లా తెరిచాడు లంబోదరం. మీనాక్షీ అంతే.

"అవును. ఫైన్‌గా ఫైనే. అంతేకాదు. ఒక్కరోజు స్కూలుకి రాకపోతే ఇరవై రూపాయల ఫైను. పర్‌ఫెక్ట్ యూనిఫాంలో స్కూలుకి రాకపోతే పది రూపాయలు ఫైను. ఇంకా... " ప్రిన్సిపాల్ మాటల్ని ఆపేస్తూ లంబోదరం అన్నాడు. "ఇది చాలా అన్యాయం సార్".

లోలోపల "ఒరేయ్ ఫైనుల్తో పేరెంట్సుని దోచు కొనే పందికొక్కా! నీ నెత్తిమీదున్న ఫ్యాను తెగి నీ బట్ట తల మీద పడ. నీ బూట్లలో తేళ్ళు దూరా" అని తిట్టు కున్నాడు తిక్కరేగి.

"ఏంటీ? అన్యాయమా? పాపమని సీటిస్తే అంత మాటంటారా? మీ సీటు క్యాన్సిల్. వెళ్ళండి" ఆవే శంతో ఆయాసపడుతూ ఊగిపోయాడు ప్రిన్సిపాల్.

"సారీ సర్. సీటు క్యాన్సిల్ చేయొద్దు" కాళ్ళా వేళ్ళా పడ్డాడు లంబోదరం.

"సరే. సరే. ఇవీ ఫీజు వివరాలు. చదువుకొని మొదటి వాయిదా ఫీజు కట్టి వెళ్ళండి" . రంగు రంగుల్లో ముద్రించిన కాగితం అందించాడు ప్రిన్సి పాల్ దయదలచిన ధోరణిలో.

డొనేషన్ ఇరవై వేల రూపాయలతోపాటు అడ్మి షన్ ఫీజు, పరీక్ష ఫీజు, స్కూల్ బస్ ఫీజు, లైబ్రరీ, లేబొరేటరీ, కంప్యూటర్ ఫీజులు అన్నీ వివరంగా ఆక ర్షణీయమైన అంకెలతో ముద్రించి వున్న కాగితం లంబోదరానికి ముచ్చెమటలు పట్టించింది. అంతేనా? ఎల్‌కేజీ నుండే ఎంసెట్, ఐఐటీలకు ఫౌండే షన్ కోర్సు ఫీజు కూడా చూసేసరికి జుట్టు పీక్కోవడం మొదలెట్టాడు లంబోదరం.

పై ఫీజులు కాక – టెక్ట్స్ బుక్కులు, నోటు బుక్కులు, బ్యాగు, బెల్టు, బ్యాడ్జి, బూట్లు, డ్రెస్సులు, స్టేషనరీ – అన్నీ స్కూల్లోనే కొనాలి.

సుమారు పాతిక ముప్ఫయి వేలకు ఎల్‌కేజీ సీటు కొనాలని పూర్తిగా అర్థమై కళ్ళు తిరిగి టేబుల్‌పై తల వాల్చి చేతులు కిందకి జార్చేశాడు లంబోదరం.

"ఏమండీ" కంగారు, భయం సందడి చేస్తుంటే గట్టిగా అరిచింది మీనాక్షి.

"మీరేం భయపడకండి. ఫీజు వివరాలు తెలుసు కొని పేరెంట్స్ ఇలా పడిపోవడం సహజమే" అంటూ లంబోదరం ముఖంపై నీళ్ళు చల్లాడు ప్రిన్సిపాల్.

మెల్లగా కళ్ళు తెరిచాడు లంబోదరం. ప్రిన్సిపాల్ వీరప్పన్‌కి కజిన్‌లా కన్పించాడు చిరునవ్వులు రువ్వుతూ.

తేరుకున్న మీనాక్షి "సార్ మొదటి వాయిదా పది వేలు అన్నారు. ఐదువేలే తెచ్చాము. మిగతా ఐదు వేలు రేపు చెల్లిస్తాం" అని అడిగింది ప్రిన్సిపాల్‌ని.

"నో. అలా వీల్లేదు. ఈరోజే ఇప్పుడే చెల్లించాలి. లేకపోతే సీటు క్యాన్సిల్" తల అడ్డంగా తిప్పుతూ అన్నాడు ప్రిన్సిపాల్.

"ప్లీజ్ సార్. చివరి రెండు మాటలు అనకండి. రేపు తప్పక చెల్లిస్తాం" వేడుకొంది మీనాక్షి.

"నో" అన్నాడు ప్రిన్సిపాల్ గట్టిగా.

ఇదంతా చూస్తున్న టింకూకి కోపం వచ్చింది.

"డాడీ! ఈ డ్రమ్ముగాడిని బతిమాలొద్దు. పద. నేనీ స్కూల్లో చదవను"బయటికి దారితీశాడు టింకూ.

"సారీ సార్. ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ. ఏదో పిల్లాడు... తెలియక..." నసిగాడు లంబోదరం – ఒక చేత్తో టింకూని ఆపుతూ.

గాంభీర్యం నటిస్తున్న ప్రిన్సిపాల్‌కి అడ్మిషన్ చేజారితే ముప్ఫైవేలు నష్టమని గుర్తొచ్చి "సర్లెండి. సాయంత్రం వచ్చి ఐదువేలు కట్టేయండి" అని కనికరి స్తున్న ఫోజిచ్చి ఐదువేలు తీసి డ్రాలో వేసుకున్నాడు.

"థాంక్యూ సర్" అని, మనసులో మాత్రం "ఒ రేయ్ ఎల్‌కేజీకి ముప్ఫైవేలు ముక్కు పిండి వసూలు చేస్తావా? నువ్వెళ్ళే దారిలో నీకు ఏక్సిడెంట్ గానూ. ఈరాత్రే మీ ఇంట్లో దొంగలు పడి సర్వం దోచుకుపో నూ" అని శపించాడు లంబోదరం. తర్వాత ముగ్గురూ ఆటోలో ఇంటికి చేరారు.

భోజనమైనా చేయకుండా లంబోదరం ఐదువేల అప్పుకోసం తిరగడం మొదలెట్టాడు. తెలిసిన మిత్రు లంతా చేతులెత్తేశారు. మనసులోని ఆందోళన శరీ రాన్ని ఆక్రమిస్తోంది. తమ ఆఫీసు అటెండర్ అప్పులి ప్పిస్తాడని గుర్తొచ్చింది. ఆఘమేఘాల మీద అటెండర్ అప్పారావు ఇంటికి వెళ్ళాడు. అంతా విన్న అప్పా రావు, "సార్! మీకు చెప్పేంతవాడిని కాదుకానీ – నాదో చిన్న మాట. అన్ని వేలు అప్పుచేసి అలాంటి ఖరీదైన స్కూల్లో మనలాంటి మధ్యతరగతి పిల్లల్ని చదివించడం అంత అవసరమా సార్! ఎల్‌కేజీ చదు వుకి అంత ఫీజా! తక్కువ ఫీజుతో మంచి విద్య అందించే పాఠశాలలు చాలా వున్నాయి సార్. మా పాపని అలాంటి స్కూల్లో చదివిస్తున్నాను. పిల్లలు పైక్లాసులకు వెళ్ళే సమయంలో – అంటే హైస్కూలు, కాలేజీ చదువుల్లో – డబ్బు చాలా అవసరమవు తుంది. ఇప్పటినుండి బాబుకోసం పొదుపు చేయండి. అప్పు చేయవద్దు. నా మాట వినడం ఎందుకను కుంటే మీ ఇష్టం. పదండి అప్పు ఇప్పిస్తాను" తన అనుభవం రంగరించి బోధ చేశాడు.

లంబోదరానికి అతని మాటల్లో సత్యం స్పష్టంగా తెలిసింది. స్కూల్లో ఇచ్చిన అడ్వాన్సు వాపసు తీసుకోవడానికి నిశ్చయించుకున్నాడు.

★